రహస్యం

మూర్తి, రావూ బల్ల దగ్గర కూచుని గోలగా తర్కించుకుంటున్నారు, క్లబ్‌లో మిగతా వాళ్లకి అర్థం కాని రీతిని. వాళ్ళిద్దరూ 'కొట్టుకోరు' అన్న నమ్మకం ఏముంది గనుక. మిగతావాళ్ళు బల్ల చుట్టూ నుంచున్నారు, ఏ ప్రమాదమూ రాకుండా కాపాడేందుకు సిద్ధమై.

మూర్తి బల్లమీద బలంగా గుద్ది ''నే నొప్పుకోనోయ్, ఆవిణ్ణి 'వ్యభిచారిణి' అంటే!'' అన్నాడు.

రాము మోహం కోపంతో జేవురించింది. జేబు రుమాలుతో నుదిటిమీద చెమట తుడుచుకుని తనూ బల్లమీద చేత్తో బాది, ''నా అనుభవాల్ని ఊరికే తుడిచేస్తే సరిపోతుందా? ఆమెని గురించి నీకేం తెలుసు నీ మొహం!'' అన్నాడు.

మూర్తి చుట్టూ ఉన్నవార్ని సపోర్టు నిమిత్తం ఒకసారి కలయజూసి '' ఒరే! నీ అనుభవం ఆమె ముందు దమ్మిడీ చేయదు. ఆమె నీ వనుకున్నట్టు అంత తేలిక మనిషికాదు ఊరికే గొంతు చించుకుంటే లాభమేమిటి?'' అన్నాడు.

రావు ఇంత చులకనగా తగ్గ తల్చలేదు. ''పోరా! నీకేం తెల్సు ఆడవాళ్ళ సంగతి! అందులోనూ ప్రత్యేకం ఈమెని గురించి నీకు ఏ. బి. సి. లు తెలీవని ఛాలెంజి చేసి చెప్పగలను. నేను పందెం వేస్తాను. ఆమె వ్యభిచారిణి అని ఏమంటావ్?'' అని అడిగాడు మూర్తి ఇక మాట్లాడ్డం అనవసరం అన్నట్టుచూస్తో.

చుట్టూ నుంచున్న వాళ్ళకి ఈ తర్కం రానురాను రసవత్తరంగా కనపడి, కొంతమంది రావు తరఫునా; కొంతమంది మూర్తి తరఫునా చీలి, కోడిపందేల వాళ్ళలా తయారై, తమ పార్టీని ఉత్సాహ పర్చనారంభించారు సంజ్ఞలతో, ఈలలతో.

మూర్తి రావుగాడి ఛాలెంజి అందుకుని, ''రైట్, ఎంత పందెం కడతావు?'' అని అడిగాడు జేబులో పర్సు బైటికి తీస్తూ.

రావు తనూ మనీ పర్సు బైటికి లాగి దాన్లో నుంచి ఐదు పది రూపాయల కాయితాలు బైటికి తీసి బల్లమీద పడేసి '' ఊఁ.... నువ్వూ పడెయ్యి. మధ్యవర్తిగా శర్మగారుంటారు!'' అన్నాడు.

తగాదా విషయం మధ్యవర్తికి చెప్పడం అవసరమైంది.

మూర్తి తనూ పందెం డబ్బు బల్లమీద పెట్టి, ''శర్మగారూ, మీరే మధ్యవర్తిగా ఉండండి. మేమిద్దరం ఒక గౌరవనీయమైన స్త్రీ విషయమై వివాద పడ్డాం. ఆమెని వీడు వ్యభిచారిణి అంటాడు. నేను

కాదంటున్నాను. ఆమె వ్యభిచారిణే అయితే నేను ఓడిపోయినట్టు. లేదా వీడు ఓడిపోయినట్టు. వీడు ఓడి పొయ్యేమాట నిజం!'' అన్నాడు ఘట్టిగా నొక్కి వక్కాణించి.

రావు సిగరెట్ అంటించి ''శర్మగారూ! ఆమె వీడన్నట్టు గౌరవనీయమైన స్త్రీ కావచ్చుగాని, వ్యభిచారిణి గాదంటే నేవొప్పుకోను. ఆ విషయం రుజువు పర్చే బాధ్యత నాది. గెలిచేది గూడా నేనే'' అన్నాడు నమ్మకంగా.

శర్మగారు ఇద్దరు చెప్పిందీ చెవుల కెక్కించుకుని, ''అంతా సరే, ఆమె పేరూ, వూరూ చెబితే మేమూ ఏదన్నా భోగట్టా ఇవ్వగలమేమో ఆలోచిస్తాం'' అన్నాడు తన లాయర్ తెలివి వుపయోగించి.

మూర్తి, రావూ, యిద్దరూ ఐదునిమిషాలు నిశ్శబ్దంగా చూసుకున్నారు, చెబుదామా వద్దా అన్నట్టు. చివరికి మూర్తి '' ఆమెని గూర్చి మేమిక్కడ ఏమాటా చెప్పడం ఆమె గౌరవానికే భంగం. మా యిద్దరిలో ఈ వివాదం విషయంలో ఎవరం ఓడిపోయినా, మీ యెదట ఆమాటని నిర్మొగమాటంగా అంగీకరిస్తాం సరేనా?'' అన్నాడు చిక్కు విడగొట్టి.

రావూ, శర్మా, మిగతావాళ్ళూ మూర్తి నిర్ణయాన్ని అంగీకరించారు.

2

పది రోజుల వరకూ, రోజూ క్లబ్‌లో ఇదే విషయమై చర్చలు సాగుతున్నై. క్లబ్‌లోని మిగతా మెంబర్లు ఎరగని ఒక విషయం రావుకీ, మూర్తికీ తెలిసి, అది పందాలదాకా వెళ్ళడం, క్లబ్ మెంబర్లకి నామర్దా అనిపించింది. ఈ అసంతృప్తిని శాస్త్రి ఒకనాడు వెళ్ళగక్కాడు.

'' ఒకే చూడండి ఇటు. ఆమె ఎవరో మనకు అసలు తెలియకుండా వుండడం, మనకెంత పరాభవం మీరే బాగా ఆలోచించండి. పరాభవం మాట అట్లా వుంచండి. రావుకీ, మూర్తికీ ఆమె విషయమై ఈ పట్టుదలలు ఏమిటి? మనం దీన్ని అంతు తేల్చుకోవాలి'' అన్నాడు.

శాస్త్రి పక్కన కూచున్న నాయుడు మూర్తీభవించిన పరాభవంలా పోజువేసి, '' ఎగ్జాక్ట్‌లీ మనం ఆమె ఎవరో అంతు తేల్చుకోవల్సిందే అందుకోసం మనం ఏ సాహసానికైనా దిగాలి!'' అన్నాడు వుద్రేకంగా మాట్లాడుతూ...

శాస్త్రి నాయుడికి షేక్‌హేండ్‌చేసి, '' ఔను ఈ విషయం అశ్రద్ధ చేయదగిందిగా కనపడ్డం లేదు. మననాయుడు, రాత్రింబవళ్ళు తిరిగి దీని అంతు తేల్చుకుంటాడు. మనక్లబ్‌లో మూర్తీ, రావేగాకుండా, మిగతావాళ్ళు తెలివికలవాళ్ళేనని రుజువు కావాలి ఈ దెబ్బతో'' అన్నాడు.

ఇంకో వారం గడిచింది. మూర్తీ, రావూ, మామూలుగా క్లబ్‌కే వస్తున్నారు పోతున్నారు - ఇద్దరి మొహాల్నీ శాస్త్రీ, నాయుడూ వాళ్ళ మిత్రులూ, పరీక్షించి చూస్తోనే ఉన్నారు. వాళ్ళకేం అంతుపట్టలేదు. ఇద్దరి మొహాలూ, విజయ సూచకంగానే కన్పిస్తున్నాయి. పట్టుదలగానే ఉన్నారిద్దరూ. ఇంతకు మించిన కొత్త సంగతులేమీ బయటకు రాలేదు. బయటపెట్టే సద్గుణం రావుకీ లేనట్టుంది! మూర్తికీ లేదు!! ఆవేళ మూర్తీ, రావూ, క్లబ్ నించి వెళ్ళింతర్వాత, శాస్త్రి నాయుణ్ణి పట్టుకుని '' నీ పరిశోధన ఏమైందిరా'' అని అడిగాడు కనీస ఫలితమన్నా ఉండదా అన్న ఆశవెలువరించి.

నాయుడు గొంతు బాగా తగ్గించి, ''శాస్త్రీ, ఈ వెధవ వ్యవహారంలో నన్ను ఇరికించడం బాగాలేదోయ్. నేను తప్పుకుంటాను'' అన్నాడు దిగులుగా.

'' ఏం? నీ సాహసం ఏమైందిరా?'' అన్నాడు శాస్త్రి ఆదుర్దాగా.

''సాహసమా? నాబొందానా! ఈ గుప్త నాటికలో స్త్రీ పాత్ర సామాన్యం కానట్లే ఉంది. ఆమె ఎవరో హఠాత్తుగా తెలిసింది మొన్న. మూర్ఛపడే షైంది. శాస్త్రీ, ఈ గొడవేదో వాళ్ళిద్దర్నే పడనియ్యి, అసలు ఈ గొడవ ప్రమాదమనే, మూర్తి కథేమీ చెప్పకుండా కమ్మేశాడు.''

శాస్త్రికి కాస్త చెమటపోసింది. సాయంత్రమైనా గాని '' ఇంతకీ ఆమె ఎవరో చెప్పేస్తే, మనం ఈ ఉద్యమం నుండి విరమించవొచ్చు'' అన్నాడు.

నాయుడికి చెమట పోసిందేమో, జేబు రుమాలుతో విసురుకుంటో, '' ఆఫనే చేయకూడదని రాత్రి బ్రహ్మాండమైన ఒట్లు వేసుకున్నాను'' అన్నాడు దడతో ఊపిరి గట్టిగా పీలుస్తో.

శాస్త్రిగారికి విసుగూ, ఆదుర్దా హెచ్చవుతోంది. '' ఇంతపిరికి వాడివని తెలిస్తే నేనే ఈ కార్యక్రమంలో దిగి ఉండేవాణ్ణి'' అన్నాడు కోపం నటించి.

'' ఇప్పుడు మాత్రం మునిగిపోయిందేముంది?'' మీరు గూడా పరిశోధన చేయడానికి కావాల్సిన అవకాశం ఉండనే ఉందాయె'' అన్నాడు నాయుడు. ఈ బెడద తనకి వొదిలి, ఇంకోడికి పోతే చాలని.

శాస్త్రి ఉత్సాహంగా, ''నేను ఎక్కణ్ణించి ఎట్లా ప్రారంభించను పరిశోధన?'' అని అడిగాడు.

'' ఈ పూటే మూర్తినిగాని, రావునిగాని, మీరు వెంబడించగలిగితే మీ పరిశోధన ప్రారంభమైనట్టే' అన్నాడు నాయుడు.

''అంతేనా?'' అన్నాడు శాస్త్రి క్షణమెట్లు దిగుతో.

'' ఇంకేమీ లేదు. కాని మీరు తగినంత జాగ్రత్తగా ఉండటం అవసరం'' అని హెచ్చరించాడు నాయుడు గృహోన్ముఖుడై.

3

అమావాస్య చీకట్లు, బజారంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ బంగ్లా ముందు గూర్ఖా కునికి పాట్లు పడుతున్నాడు. రెండోవైపు కట్టేసిన వేటకుక్క నిశ్శబ్దంగా పడుకుని ఉంది మధ్య మధ్య చెవులు టపటపలాడిస్తూ. బంగ్లాలోని దీపాల మందమైన వెలుతురు డాబా కిటికీల గుండా తోటలో చెట్లమీదికి ప్రసరిస్తోంది. బంగ్లా క్రింది అంతస్తులో చీకటి. ఆవరించి ఉంది. ఆ అంధకారంలో ఎవరో గుసగుస లాడుతున్నారు. మొదటిది స్త్రీ స్వరం, రెండోది పురుషధ్వని.

స్త్రీ స్వరం ఉలిక్కి పడ్డట్టు మధ్య మధ్య నత్తిగా, ''వెళ్ళు... ఇక్కడికి రావొద్దని చెప్పలేదూ? నన్ను వేధించకు...'' అంటోంది వొణుకుతో.

పురుషస్వరం దృఢంగా ''అట్లా తేలికగా వెళ్ళను... వెళ్ళడానికైతే ఇంత శ్రమపడి నిన్ను కలుసుకోటం ఎందుకు?... నాకు కావాల్సింది...'' అంటున్నాడు.

''అమ్మయ్యో! అట్లా గట్టిగా మాట్లాడకు.. ఆయన వస్తే...'' స్త్రీ స్వరం విపరీతంగా ఒణుకుతోంది.

'' ఏం వొస్తే? రానియ్యి''...

ఇంతలో మేడ మెట్ల మీద నించి ఎవరో కిందికి దిగిన బలమైన బూట్లధ్వని వినపడ్డది. స్త్రీ స్వరం మెల్లిగా, విషాదంగా కేకేసింది. ఆ చీకట్లో, ఎవరో ఎవర్నో బలమైన దెబ్బలు కొడ్తున్నట్లూ, తర్వాత పెద్ద మూలుగూ వినిపించాయి. ఐదు నిమిషాల తర్వాత, అంతా నిరామయమైపోయింది.

దీన్నంతా చెట్ల సందున కూచుని చూస్తున్న శాస్త్రికి వళ్ళు గగుర్పొడిచింది. ఐదు నిమిషాలు భయంతో అతను కొయ్యబారిపోయినాడు. తర్వాత తెప్పరిల్లుకుని కాంపౌండు గోడ మెల్లగా దూకి, ఎట్లా ఇల్లు జేరుకున్నాడో అతనికే తెలియదు. మర్నాడు తెల్లారీ తెల్లారక ముందే అతను క్లబ్‌కి వొచ్చాడు. నాయుడు అరగంటకి వచ్చాడు. ఇద్దరూ క్లబ్‌లో ఉన్న హోటల్‌లో మూలగా కూచున్నారు. శాస్త్రి కాఫీ తాగుతున్నాడన్న మాటేగాని, ఇంకా గుండె దడగానీ, మానసికాందోళన గానీ తగ్గలేదు. రాత్రి జరిగిందేమిటి? నేరం అన్నంతవరకు శాస్త్రికి స్పష్టమే.

నాయుడు శాస్త్రి వంక అదే పనిగా పదినిమిషాలు చూసి చిరునవ్వునవ్వి, ''మొన్నటి తర్వాత నీ వర్చస్సులో ఇంత భయానకం వ్యాపించటానికి ఏం జరిగిందేమిటి?'' అని అడిగాడు. ఏదో జరిగి ఉంటుందని నమ్మిన గొంతుతో.

శాస్త్రి కాఫీ కప్పు ఖాళీచేసి, చాలా చాలా మెల్లిగా ఒకసారి చుట్టూచూసి, గొంతు సవరించుకుని ''రాత్రి మన మూర్తి సాఫయినాడని నా నమ్మకం... నా కళ్ళారా చూశాను...'' అన్నాడు.

''ఏమిటీ?.... మూర్తీ....?'' నాయుడు తెరిచిన నోరు తెరిచినట్టే ఉండిపోయింది ఐదునిమిషాలు. ''ఇట్లాంటిదేదో జరుగుతుందని నేనెప్పుడో అనుకున్నానులే!'' అన్నాడు. తర్వాత శాస్త్రి ఆమోద సూచకంగా తలూపి, ''కాదు మరీ? పాముతో చెలగాటం ఏమిటి?...'' అని చప్పరించి, వూపిరి తీసుకుంటూ, ''మరి మన మూర్తిని గూర్చి అయినా మనం ఏదన్నా చర్య తీసుకోనక్కర లేదా?'' అని అడిగాడు నాయుణ్ణి. నాయుడు దిక్కులు చూస్తో ''మనకెందుకూ మధ్య ఏదైనా నేరమే జరిగి ఉంటే దాన్ని బైట పెట్టడానికి లా అండ్ ఆర్డర్ ఉండనే ఉంది. కావలిస్తే మనం సాక్ష్యం చెబుదాం'' అన్నాడు. శాస్త్రి తల వూపడం తప్ప ఇంకేం చెయ్యలేకపోయినాడు.

4

రెండు రోజుల్లో శాస్త్రి నాయుడికి మాత్రం తెలియజేసిన రహస్యం, మెల్లిగా ప్రతి క్లబ్ మెంబర్‌కీ రహస్యంగానే తెలిసిపోయింది. క్లబ్‌లో విపరీతమైన అలజడి పైకగుపించకుండా లోలోపల వ్యాపించింది. ప్రతివారూ, ఈ విషయమై ఏదో చెయ్యాలని ఉబలాటపడుతూ ఏమీ చెయ్యలేకపోతున్నారు. వాళ్ళ అనుమానం ధృఢం కావడానికా అన్నట్టు, రావుగాని, మూర్తిగాని, క్లబ్ దగ్గరకే రాలేదు! ఇక తీర్మానంగా, మూర్తి సాఫ యినాడనే వుద్దేశానికి క్లబ్‌లో వాళ్ళు వొచ్చిన రోజు మధ్యాన్నమే, మూర్తీ, రావూ చెట్టపట్టాలు

పట్టుకుని సరాసరి కేరమ్సు ఆడుతూన్న శర్మగారి దగ్గరికి వచ్చి నిలబడ్డారు. మిగతావాళ్ళ సంగతి ఏమైనా, శాస్త్రి కొయ్యబారిపోయినాడు. అతను తన ఆశ్చర్యం నించి తేరుకునే ముందే రావు, శర్మతో ఇలా అంటున్నాడు. ''శర్మగారూ! నేను ఓడిపోయినాను పందెంలో, ఆమె గౌరవనీయమైన స్త్రీయే గాక, వ్యభిచారిణి కాదు కూడా!''

శర్మ, తన మిత్రుడివంక తదేక ధ్యానంగా చూసి, ''రుజువు చేసుకున్నారా'' అని మాత్రం అడిగాడు. రావు తలూపాడు. శాస్త్రి ఇంతలో తెప్పరిల్లుకుని,'' అయితే రావూ! ఆవేళ రాత్రి నేను చూసిందేమిటి? ఆ ప్రకారం నువ్వు గెలిచినట్టే ఔతుందిగా? పైగా ఈ మూర్తి ఇక్కడ ఎట్లా ఆరోగ్యంగా ఉన్నాడని నాకు తగని ఆలోచనగా ఉంది!'' అన్నాడు.

రావూ, మూర్తీలు పకపక నవ్వారు. నవ్వాగిన తరువాత, రావు గొంతు సవరించుకుని, ''శాస్త్రీ! నువ్వు చూసిందేమో నిజమే. ఆమె ఎవరో నీకు తెలుసు. ఆమె ఎవరో ఇక్కడ అందరికీ ఈ పాటికి తెలిసే వుంటుంది గూడాను... ఆమె... ప్రస్తుతపు అంతస్తు ఎటువంటిదో నీకు తెలిసే ఉన్నప్పుడు, నేను చెప్పబొయ్యే విషయం నీకు సులభంగా బోధపడుతుంది గూడానూ!'' అన్నాడు.

శర్మ ఈ సంభాషణకి అడ్డుపడి, '' ఈ గూడుపుఠాణీ ఏమిటి రావూ? ఆమె ఎవరో, ఈ గందరగోళం ఏమిటో విశదంగా చెప్పరాదూ?'' అని అడిగాడు.

రావు క్లబ్‌లో అందర్నీ ఒకసారి చూసి, ''పోలీసు సూపర్నెంటు గారి భార్య! ఆయన మాకు వ్యక్తిగత స్నేహితుడు. ఆయనతో అప్పుడప్పుడు చదరంగం ఆడడానికి వెళ్తుండేవాళ్ళం మేం. ఈ పరిచయాన్ని పురస్కరించుకునే, ఆయన భార్య కూడా మాకు పరిచయమైంది. ఆమె అందమైనదే గాకుండా, చాలా కలుపుగోలుతనంగా గూడా ఉంటుండేది. అందువల్ల ఆమెను గూర్చి మేము కాస్త కనిపెట్టి చూడడం సంభవించింది. మానవ మర్యాదలు పైకి ఎలా ఉన్నా లోపల పనిచేసే సామాన్య శక్తుల స్త్రీ భావం మమ్మల్ని వొదిలింది కాదు.

ఒక స్త్రీ అందంగా ఉండి కలుపుగోలు తనంగా, సహజంగా ప్రవర్తిస్తో ఉంటే, ఛాన్సు కావాలని, ఎగబడకుండా ఉండటం నా వరకూ అసంభవమైంది. ఆమెని పరీక్షించసాగాను. నా దృష్టికోణంలో ఆమె సద్గుణ వతిగా నటించే దుర్గుణవతిగా కన్పించింది. కాని, నా అనుమానాన్ని దృఢం చేసుకునేందుకు అవకాశం దొరక్క బాధపడసాగాను. మూర్తి మొదట్నించీ నా అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాడు. కనీసం స్త్రీని గౌరవించమని నన్ను మందలించాడు. నేను అతన్ని హేళనచేసి, నవ్వాను. ఆమెలో నేననుకున్న గుణాలున్నాయని నిరూపిస్తానన్నాను. మూర్తి పెదాలు చప్పరించి 'అసంభవం' అన్నాడు.

తర్వాత ఒకరోజు రాత్రి 10 గంటల ప్రాంతాన సినిమా నించి వొస్తో సూపర్నెంట్ బంగ్లా మీదగా నడుస్తున్నాను. బంగ్లా వరండాలో చీకటిలో ఆమె ఎవరో పురుషుడుతో గుసగుసలాడడం నా కంట పడింది. నా అనుమానం రూఢి అయింది. ఆ దృశ్యం నాలో జెలసీని వృద్ధి చేసింది. మర్నాడు విషయం మూర్తికి చెప్పాను. అతను నమ్మలేదు. ఆ రోజే ఆయనతో చదరంగం ఆడుతూ, గదిలోకొచ్చిన ఆమెని పరీక్షించాను. ఆమెలో ఏవికారమూ పొడగట్టలేదు. అవ్యక్తంగా ఏదన్నా విచారం ఉందేమో ఆమె లోపల... ఆ వేళే మేము క్లబ్‌లో పందెం వేసుకున్నాం.

పదిహేను రోజులు, ప్రతిరాత్రీ సూపర్నెంట్ బంగ్లా దగ్గర గాలికి కూడా తెలీకుండా నేనూ, మూర్తీ కాపలా కాశాం. మళ్ళీ వాళ్ళిద్దరూ కలుసుకోనేలేదు. ఇందువల్ల నాకూ, మూర్తికీ పట్టుదలలు హెచ్చాయేగాని తగ్గలేదు. ఆఖరుకి, శాస్త్రి మమ్మల్ని వెంటాడిన రోజు నన్నమాట - పగలు సూపర్నెంట్ ఇంట్లోనే మామూలుగా చదరంగం ఆడుతున్నాం. మాకు 'టీ' ఇవ్వడానికి ఒచ్చిందామె. ఆమె వర్ఛస్సులో ఎన్నడూ లేనంత గాభరా కన్పిస్తోంది. ఈ విషయాన్ని నేను కనిపెట్టడానికి ఎక్కువ సేపు పట్టలేదు. ఇవ్వాళ వాడు(?) వొస్తాడు గావును! అనుకున్నాను. ఇంకేం? రాత్రికి నేనూ, మూర్తీ తయారైనాం బంగ్లా దగ్గరికి తర్వాత సంగతి మీకు తెలిసే ఉంది. తెల్లారి, ఉండబట్టలేక పగలు పది గంటలకే సూపర్నెంటు గారింటికి వెళ్ళాం. ఆయన మామూలుగా లేడు. కోపం, అసహ్యం, చీదర స్పష్టంగా అతని మొహంలో వెళ్ళాడుతున్నై. ఏది ఎట్లా ఉన్నా, మమ్మల్ని మటుకు ఆహ్వానించి చదరంగం దగ్గర కూలబడ్డాడు. నాకా రాత్రి జరిగిందేమిటో తెలుసుకోవాలని చాలా ఆదుర్దాగా ఉంది. మెల్లిగా మాట్లాడుతూ మాట్లాడుతూ ''రాత్రి బంగ్లాలో ఏదో గంద్రగోళం జరిగిందనుకుంటాను'' అన్నాను తెగించి. ''మీకెట్లా తెలుసు?'' అన్నట్టు చూశాడు పెద్దగా గుడ్లు ఉరిమి.

మూర్తి అందుకుని, అవునండీ, మేము సినిమానించి ఇటు పోతో, విన్నాం లెండి'' అన్నాడు సూపర్నెంటు మొహం ఎర్రబారింది. కత్తి వేటుకి నెత్తురు చుక్కలేదు. పదినిమిషాలు పాదాలకింద భూమి కుంగిపోయినట్టు అయిందతనికి. తర్వాత తమాయించుకుని ఇలా చెప్పనారంభించాడు.

5

''మీరు అపార్థాలు తీయకుండా ఉండాలని చెబుతున్నాను. నా భార్యకి ఒక్కగాను ఒక్క అన్న ఉన్నాడు. అతని స్థితి ఎటువంటిదో చెప్పక తప్పదు. అతనికి చదువు తక్కువ. భార్యా పిల్లలూ ఉన్నారు. మొత్తం మీద పెద్ద సంసారం. అతను ఉద్యోగం చేసి సంపాయించే అరవై రూపాయలూ ధూపానికి చాలవు. అతను తన సంసారం కూటికీ గుడ్డకీ పడే బాధ చూసి, ఉద్యోగరీత్యా రాగల లంచాలు పుచ్చుకోడం ప్రారంభించాడు. ఈ కారణం వల్ల అతని ఉద్యోగం ఊడిపోయింది. అభిమానం లంచాలు పట్టేవాడిలోనూ ఉంటుదేమో! అసలు లంచం పట్టకుండా నీతిగా బతికి అతను తన సంసారాన్ని పోషించుకోలేకపోయినాడు, కాని తన చెల్లెల్ని అడిగి పది రూపాయలన్నా తీసుకెళ్ళలేదు ఎప్పుడూ... నన్ను అతను కలుసుకుని దాదాపు పదేళ్ళవుతుంది. కాని సంవత్సరం క్రితం అతను, దేనికన్నా గాని, పెద్దదొంగతనమే చేశాడనీ, సంవత్సరం శిక్ష పడిందనీ తెలిసింది మాకు. ఇక, అతని భార్యా పిల్లలకి దిక్కెవరు? నేనే వాళ్ళ అడ్రసు కనుక్కుని, కొద్దిగా సహాయం చేసాను. అయితే, వాళ్ళనిగాని, దొంగతనం చేసి జైలుకి వెళ్ళిన తన అన్నను గాని కలుసుకోరాదని నా భార్యకి గట్టిగా చెప్పాను. ఔను, నేనేం చెయ్యను? నాలో మానవత్వం లేక కాదు నేనా పనిచేసింది. నాహోదాకి, ఉద్యోగానికీ వెరిచి సూపర్నెంటు గారి బావమరిది ఒక పక్క దొంగ అనిపించుకుంటూ, నా యింట్లో తిరగటం నేను సహించరాని విషయమైంది.

''చివరికి అతను నెల రోజుల క్రితం విడుదలైనాడని తెలిసినప్పుడు, నా భార్య అతన్ని చూడాలని చాలా పట్టుపట్టింది. నేను వల్లగాదన్నాను. దీనికి తోడు, అతను నా భార్యకి ఒక ఉత్తరం రాశాడు. అందులో ఏముందో, నేను చూడలేదు.

''అతనికి నా భార్యరమ్మని వ్రాసింది గావును. పదిహేను రోజుల క్రితం ఒకరోజున రాత్రిపూట అతను నా యింటికి రహస్యంగా వచ్చి చెల్లెల్ని కలుసుకున్నాడు. డబ్బుకోసమే ననుకుంటా. నా భార్య నాకు ఈ సంగతి తెలీకుండానే ఉంచింది. కాని గేట్‌కాపలా ఉన్న గుర్ఖా నాకు జరిగిన సంగతి చెప్పేశాడు. ఆ వేళ నా భార్యని దెబ్బలు గూడా కొట్టానని నాకు జ్ఞాపకం. ఆమె ఇక ముందు ఏ పరిస్థితుల్లోనూ, తన అన్నని కలుసుకోనని ప్రమాణం చేసింది''.

''ఐతే రాత్రి అతను మళ్ళీ వచ్చాడు. నా భార్యకి అతను ముందుగానే తెలియజేసి ఉండటం వల్ల, ఇద్దర్ఘా, కలుసుకున్నారు. నాకు ఎందుకో మెలుకువ వచ్చి గదిలో చూస్తే ఆమె లేదు. వెంటనే కిందికి వచ్చి చూశాను. అతనూ ఆమె మాట్లాడుకుంటున్నారు. నా ముక్కోపం కొద్దీ ఆమెనీ, అతన్నీ బాదాను. అతను ఏ మాత్రం నాకెదురు తిరగలేదు. తర్వాత ఇద్దర్నీ లోపలికి లాక్కొచ్చాను. నా నోటికొచ్చినట్టు నా బావమరిదిని తిట్టాను. అన్ని తిట్లూ అయినతర్వాత అతను మాట్లాడాడు. ''బావా! నేనిప్పుడు ఎందుకొచ్చానో, ఏ పరిస్థితుల్లో వచ్చానో, కాస్త విను'' అన్నాడు.

'' ఏమిటి వినేది? ఒక దొంగ నా చుట్టం అనుకుంటూ, నా యింటికి రావటం నా కిష్టం లేదు'' అన్నాను నేను.

''కాని బావా! మనిషిగా, మనిషి చెప్పేది విను. నా భార్య భయంకరమైన వ్యాధితో, ఇప్పుడో ఇంకా కాసేపటికో అన్న స్థితిలో ఉంది. నా పిల్లలు ఆకలితో నరకద్వారంలో మూలుగుతున్నారు. నా దగ్గర చిల్లిగవ్వలేదు నాకు... ఒక దొంగకి అప్పెరిస్తారు? మీరు... నాకు బావ అయిగూడా ... నన్ను దగ్గరికి రానీయడమే అవమానంగా భావించారు. ఇక పరాయి వారెవరికి జాలి ఉంటుంది?... నేను వెళ్తున్నాను బావా! ఇక తిరిగి రాను గూడా.... వొచ్చేందుకు నేను ఉండను'' అంటూ, తన చెల్లెలు బతిమాలినా వినకుండా, నేను ఇవ్వబోయిన పైకం తీసుకోకుండానే ఆ అర్ధరాత్రి వేళనే ఎటో వెళ్ళిపోయినాడు. అప్పట్నించీ నా భార్య ఓ మాదిరిగా ఉంది.... ఆమెకి పిచ్చెత్తినా ఆశ్చర్యపడాల్సిన పనేమీ లేదని నా ఉద్దేశం. నా గౌరవం, నా ప్రతిష్ఠ, నా ఉద్యోగం, ఇవన్నీ కలిసి, నా మానవత్వాన్ని చంపేస్తున్నాయేమో అని కుళ్ళి కుళ్ళి చస్తున్నాను. ఇంత కంటే ఏమీ లేదు'' అని సూపర్నెంటు తన కథ పూర్తి చేశాడు. మేమిద్దరం, ఆయన్ని సాధ్యమైనంతగా ఓదార్చి, ఆయన బావమర్ది అడ్రస్ తీసుకున్నాం కనపడితే పట్టుకొస్తామని వాగ్దానం చేసి. ఇప్పుడు నేను ఓడిపోయినట్టేగదా?'' అన్నాడు రావు.

క్లబ్ మెంబర్ల మొహాలన్నీ జేవురించినై. ఏదో విషాదం గాలిలో కలిసి వాళ్ళందర్నీ ఆవరించినట్టుంది. ఇంతలో నాయుడు రావును భుజంమీద తట్టి, ''మరి శాస్త్రి, ఆ రాత్రే మూర్తి సాఫయి నాడని మమ్మల్ని గాభరా పెట్టాడు గదా? ఎందుకట్లా?'' అని అడిగాడు.

రావు నవ్వుతూ, '' ఏముందీ? సూపర్నెంటు బావమరిదీ, మూర్తి, ఒడ్డూ పొడుగూ ఒక్కటే అందుకని శాస్త్రి చీకట్లో కాస్త పొరపడి ఉంటాడు'' అన్నాడు.

(జ్యోతి సచిత్ర పక్ష పత్రిక 15 జూలై 1948)